

నేడు చిత్తూరులో కల్యాణ్ జ్యువెలర్స్ ప్రారంభం
ముఖ్య అతిథిగా రానున్న హీరో నాగార్జున

ప్రజాశక్తి - తిరుపతి సిటిదేశంలోని అత్యంత విశ్వసనీయ, ప్రముఖ ఆభరణాల బ్రాండ్‌లలో ఒకటైన కళ్యాణ్ జ్యువెలర్స్ చిత్తూరులోని ఎమ్మెస్సార్ సర్కిల్‌లో తమ సరికొత్త షోరూమ్‌ను శుక్రవారం ప్రారంభించుకుని ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలను విస్తరించనున్నట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేష్ కళ్యాణరామన్ తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ప్రాంతీయ బ్రాండ్ అంబాసిడర్ ప్రముఖ సినీ హీరో అక్కినేని నాగార్జున శుక్రవారం ఉదయం 10.30 గంటలకు సరికొత్త షోరూమ్‌ను ప్రారంభిస్తారని చెప్పారు. ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 9వ షోరూమ్ అని తెలిపారు. ప్రస్తుతం ఆభరణాల బ్రాండ్ విజయవాడ, విశాఖపట్నం, నెల్లూరు, తిరుపతి, గుంటూరు రాష్ట్రంలోని అనేక మార్కెట్‌లలో తన కార్యకలాపాలు నిర్వహిస్తుందన్నారు. షోరూమ్ ప్రారంభోత్సవానికి కళ్యాణ్ జ్యువెలర్స్ ఒక ప్రత్యేకమైన ప్రమోషన్‌ను అందిస్తోందని, కనీసం రూ. 1 లక్ష ఆభరణాలు షాపింగ్ చేసే కస్టమర్‌లకు సగం కొనుగోలు విలువపై 0% మేకింగ్ ఛార్జీలు అందిస్తారు.

'బీమా' రాదు.. 'ఆశ' చావదు..!



పాడిరైతు గురవమ్మ, తిరుపతి జిల్లా కంచనపల్లి వాస్తవ్యురాలు. రెండేళ్ల కిందట గేదె చనిపోయింది. పశుసంవర్ధక శాఖ వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. రూ.15వేలు పరిహారం వస్తుందని చెప్పారు. అయితే ఇప్పటికీ ప్రభుత్వం నుంచి పరిహారం రాలేదు. రూ.78వేలు ఖర్చు పెట్టి గేదెను కొనుగోలు చేశారు. పాడి ఆధారంగా జీవిస్తున్నారు. జీవనాధారమైన గేదె చనిపోవడం, ప్రభుత్వం ఇవ్వాల్సిన బీమా పరిహారం అందకపోవడంతో ఎప్పటికైనా వేస్తారనే ఆశతోనే గురవమ్మ నిరీక్షిస్తోంది.

శ్రీకాళహస్తి రూరల్ పాతగుంట పంచాయతి అమ్మచెరువు గ్రామంలో ఇటీవల కురిసిన వడగళ్లవాన విపత్తుకు మూడు పాడి ఆవులు అక్కడికక్కడే మృతిచెందాయి. వాటి విలువ దాదాపు లక్షన్నర పైనే ఉంటుంది. ఆ సందర్భంగానే గ్రామంలోని రైతులు సాగు చేస్తున్న వరి పూర్తిగా నష్టపోయారు. వ్యవసాయ అధికారులు వచ్చారు.. నష్టం అంచనాలు కట్టి వెళ్లారు. అయితే విపత్తు సందర్భంగా నష్టపోయిన వారికి ఇటీవల నష్టపరిహారాన్ని అందజేశారు. అయితే ఆ గ్రామంలో చనిపోయిన మూడు పశువులకు సంబంధించి గానీ, వరి పంట సంబంధించి గానీ పైసా పరిహారం ఇప్పటికీ అందలేదు. తమగురించి పట్టించుకునే దిక్కు లేదని, అధికార పార్టీ అనుయాయులకు మాత్రమే నష్టపరిహారం అందుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. పశువులు ఏవి చనిపోయినా పరిహారం ఇవ్వడం లేదన్నది వారి ఆవేదన.

ఏళ్లతరబడి పాడి రైతు నిరీక్షణ
తెరపైకి కొత్త పథకం అమల్లోకి..

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి

వ్యవసాయం జూదమై ఎపుడు గిట్టుబాటవుతుందో, ఎపుడు కరువు ఉంటుందో అర్థం కాని అన్నదాతను పాడిపరిశ్రమ ఆదుకుంటోంది. లేదంటే పొట్ట చేత బట్టుకుని ఎన్నో కుటుంబాలు వలస వెళ్లేవే. గత ప్రభుత్వంలో పశువులు ఏదైనా ప్రమాదంలో మృతిచెందితే పాడి పశువుల బీమా పథకం ద్వారా రైతులకు రూ.30వేలు నష్టపరిహారం అందేది. అయితే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పథకానికి వైఎస్ఆర్ పశు నష్టపరిహార పథకం అని పేరు పెట్టారు. పథకం పేరు మార్చి ప్రచారం చేసుకున్నారే తప్ప, పరిహారం మాత్రం అందించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా ఉచిత పశు బీమా పథకానికి మంగళం పాడి, కొత్త పథకాన్ని తెరపైకి తీసుకురానున్నట్లు సమాచారం. అక్టోబర్ నుంచే ఈ కొత్త పథకం అమల్లోకి రానుందని పశు సంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే పాత పథకంలో పరిహారం అందాల్సిన లబ్ధిదారులు ఏళ్ల తరబడి నిరీక్షిస్తూనే ఉన్నారు. తిరుపతి జిల్లాలో గత ఆర్నెళ్లుగా ఉచిత బీమా పథకం కార్యకలాపాలు ఆగిపోయినట్లు రైతులు చెబుతున్నారు.

తిరుపతి జిల్లా వ్యాప్తంగా గతేడాది 2125 మంది రైతులకు ఉచిత బీమా పథకం కింద రూ.5.75 కోట్లు పరిహారం అందజేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు 195 మంది రైతులకు మాత్రమే పూర్తి స్థాయిలో పరిహారమందించామనీ, కేవలం 20 మంది పాడి రైతులకు రూ.60 లక్షల బకాయి మాత్రమే చెల్లించాల్సి ఉందంటూ పశు సంవర్ధక శాఖాధికారులు చెబుతున్న మాట. ఆ పరిహార మొత్తం కూడా సీఎఫ్ఎంఎస్ ఖాతాల్లో భద్రంగా ఉన్నాయనీ, త్వరలోనే రైతులకు చెల్లిస్తామంటూ చెబుతున్నారు. అయితే వాస్తవిక పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. అధికారిక లెక్కలకు, అందాల్సిన లెక్కలకు పొంతన లేకుండా ఉంది.

- **తెరపైకి కొత్త పథకం**

పాడి రైతులను ఆదుకునేందుకు పాలక ప్రభుత్వాలు పశు బీమా పథకాన్ని అమలు చేస్తున్నారు. గతంలో ఈ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పాడి రైతులకు నష్టపరిహారం అందేది. ఈ పథకంలో ప్రతి పాడి రైతు పశువుకు బీమా కోసం ప్రీమియం చెల్లించాలి. ప్రీమియం చెల్లించి పశువు ప్రమాదం లేదా సహజమరణం ద్వారా మతి చెందితే రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించేది. ఈ పథకం కింద పశువు చనిపోయిన 15 రోజుల్లోగా రైతుకు నష్టపరిహారం ఇవ్వాలి. అయితే పశువు చనిపోయిన రెండు నుంచి మూడు నెలల్లో రైతులకు నష్టపరిహారం అందుతూ వచ్చేది. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 2022లో ఈ పథకాన్ని మార్చి వైఎస్సార్ పశు నష్ట పరిహార పథకం పేరుతో జీవో నెం.3 తెచ్చారు. కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం లేకుండా పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే బీమాను చెల్లిస్తుంది. రైతులు ఎటువంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ పథకం ప్రారంభమైన కొత్తలో తమ ప్రభుత్వం రైతులకు కొండంత అండగా నిలిచిందని ప్రభుత్వం గొప్పలు పోయింది. అయితే తర్వాత ఈ పథకాన్ని అటకెక్కించిందని రైతులు ఆరోపిస్తున్నారు. దాదాపు ఆర్నెళ్లుగా ఈ పథకం ఆగిపోయినట్లు రైతులు చెబుతున్నారు.

- **80 శాతం రాయితీ**

కొత్తగా అమల్లోకి వస్తున్న వైఎస్సార్ పశు బీమా పథకం కింద చెల్లించే మొత్తం ప్రీమియంలో 80 శాతాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. 20 శాతం మాత్రమే సన్న, చిన్నకారు రైతులు భరించాల్సి ఉంటుంది. నాటు ఆవులు, గేదెలకు రూ.15 వేలు, మేలు జాతి గేదెలు, ఆవులకు రూ.30 వేల చొప్పున, సన్న జీవాలకు ఒక్కో దానికి రూ.6 వేలు చొప్పున పరిహారం ఇస్తారు. ఏడాదిలో ఒక రైతుకు గరిష్టంగా ఐదు పశువులకు మాత్రమే బీమా వర్తిస్తుంది. గతంలో ఏదైనా విపత్తు బారినపడి చనిపోతే ఒక్కో కుటుంబం పరిధిలో 20 సన్నజీవాలకు రూ.1.20 లక్షలకు మించకుండా పరిహారం చెల్లించేవారు. ఇప్పుడు దాన్ని 50 జీవాలకు గరిష్టంగా రూ.3. లక్షల వరకు పరిహారం పొందేలా విస్తరిస్తున్నారు. గతంలో మూడు అంతకంటే ఎక్కువ సంఖ్యలో మర ణిస్తేనే సన్నజీవాలకు పరిహారం ఇచ్చేవారు. ఇక నుంచి ఒక్క జీవి మరణించినా పరిహారం అందనుంది. అంతేకాదు తొలిసారి ఎద్దులు, దున్నపోతులతో పాటు కరువు బారిన పడిన పశువులకు కూడా బీమా వర్తింప చేయనున్నారు. దేశీయ ఆవులు, గేదెలకు ఒక్కోదానికి ప్రభుత్వం రూ.924 ప్రీమియం భరిస్తుండగా, లబ్ధిదారులు రూ.231, ఎద్దులు, దున్నపోతులకు లబ్ధిదారులు రూ.116, మేకలు, గొర్రెలకు ప్రభుత్వం ఒక్కోదానికి రూ.185 భరిస్తుండగా, లబ్ధిదారులు రూ.46 చెల్లించాల్సి ఉంటుంది.



పశువులకు బీమా కొరకు ట్యాగింగ్ చేస్తున్న పశు వైద్య సిబ్బంది

త్వరలోనే పూర్తి బకాయిలు చెల్లిస్తాం
రవికుమార్, పశుసంవర్ధక శాఖ జేడిఎ

గతంలో ఉన్న వైఎస్సార్ ఉచిత పశు నష్టపరిహార పథకం ఆగిన మాట వాస్తవమే. అయితే ఆ పథకం కింద బీమాకు అర్హులైన పాడి రైతులందరికీ పూర్తి స్థాయిలో పరిహారం అందేలా చర్యలు చేపడుతున్నాం. మొత్తం 2125 మంది రైతులుండగా కేవలం 20 మంది రైతులకు మాత్రమే బీమా ఆగింది. మరో రెండు వారాల్లో బీమా నగదు వారి ఖాతాలకు చేరుతుంది. కొత్త బీమా పథకంపై రైతుల్లో అవగాహన పెంచుతున్నాం.


సమస్యలు 'సారూ..'.. స్పందించాలి 'మీరు'

నేడు ఆర్‌సిపురంలో 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి - రామచంద్రాపురం

ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రజలకు మరింత చేరువయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం వారంలో ప్రతి బుధ, శుక్రవారాల్లో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చింది. మండల పరిధిలో వస్తున్న సమస్యలను జిల్లాస్థాయి అధికారి స్వయంగా పరిశీలించి వాటిని పరిష్కరిస్తున్నారు. ఈ నేపథ్యంలో రామచంద్రాపురం మండలంలో దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని మండలవాసులు కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డిని కోరుతున్నారు.

- అనుపల్లి పంచాయతీలో 2017వ సంవత్సరంలో 150 మందికి సంబంధించిన 300 ఎకరాల డీకేటీ పట్టాల రద్దుపై న్యాయం చేయాలని రైతుల కోరుతున్నారు.
- సి రామాపురం. అనుపల్లి, నెత్తకుప్పం, నెన్నూరు. సి.కె పల్లి రెవెన్యూ గ్రామాలలో ప్రభుత్వ భూములు(వాగు. గుట్ట. కాలువ, చెరువు. కుంట పరంబోకు స్థలాలు) యథేచ్ఛగా కబ్జా అవుతూ భవనాలు వెలుస్తున్నాయి.
- సి రామాపురంలో గ్రామ కంఠం సర్వే నెంబర్లు వేసి గుట్ట పోరంబోకు స్థలాలను రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు.
- మండలంలో ఇంటి వద్దకే రేషన్ బియ్యం కార్యక్రమం పూర్తిగా ఆగిపోయింది.
- అన్ని గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం లోపించడం వల్ల దోమల బెడద ఎక్కువై ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు.
- ప్రభుత్వ కార్యాలయాలలో సిటిజన్ చార్ట్ ప్రకారం పౌరులకు అధికారులు సేవలు అందించడం లేదని, ప్రజలు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.
- మండలంలో మద్యం బెల్టు షాపులు. నాటు సారా విక్రయాలు, నాటు సారా తయారీ విచ్చలవిడిగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు.
- రెవెన్యూ శాఖలో రైతుల భూములు, ఒకరి భూమిని... వేరొకరి పేరుతో ఆన్లైన్లో నమోదు చేస్తున్నారు.
- వ్యవసాయ శాఖలో రాయితీలతో ఇచ్చే ప్లాస్టిక్ పైపులు, యంత్రాలు, వేరుశనగ విత్తనాలు సక్రమంగా అందడం లేదు.
- రాయలచెరువు- అనుపల్లి రోడ్డు మార్గంలో తిమ్మరాజు పల్లి హరిజనవాడ వద్ద కల్వర్టు నిర్మాణం, కూనేపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో నలరాళ్ల వంకపై వంతెన నిర్మించాలని దళితులు కోరుతున్నారు.
- రామచంద్రపురం మండలానికి ఆనుకొని ఉన్న స్వర్ణముఖి నదిపై వంతెన నిర్మించి రహదారి సౌకర్యం కల్పించాలి.
- నెన్నూరు వద్ద రాయల చెరువు సప్లై ఛానల్ పై వంతెన నిర్మించాలి, అలాగే వెంకట్రామాపురం నుండి తిరుపతికి వెళ్లే మార్గంలో నక్కల వాగుపై వంతెన నిర్మించాలి.



తిమ్మిరాజుపల్లి హరిజనవాడ వద్ద వర్షానికి కొట్టుకుపోయిన ఆర్ అండ్ బి రోడ్డు (ఫైల్)

ప్రతి కుటుంబానికీ ఉచితంగా సంపూర్ణ వైద్యం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ప్రతి కుటుంబానికీ సంపూర్ణ వైద్యం ఉచితంగా అందించాలని జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని, ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా స్పెషల్ ఆఫీసర్ శ్యామలరావు, కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం కలెక్టర్‌తో కలిసి స్పెషల్ ఆఫీసర్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ వివరిస్తూ గత నెల 30 నుండి ఈ నెల 4 వరకు జిల్లాలో 66 సచివాలయాల పరిధిలో ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపులను నిర్వహించి 24 వేల మందికి పైగా ఓపి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని, అందులో పాఠశాల పిల్లలకు , గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహణ, కంటివెలుగు కార్యక్రమం కింద 1240 మందికి కంటి అద్దాలు పంపిణీ, 570 మందిని ఆరోగ్యశ్రీ సేవలకు రెఫర్ చేశామని వివరించారు.

పాకాల మండలం గాదంకి సచివాలయ పరిధిలో జిల్లా పరిషత్ హైస్కూల్లో 828 కుటుంబాలకు గాను 810 మందికి వైద్యసేవల టోకెన్లు మంజూరు రికార్డులను పరిశీలించారు. గ్రామంలో పర్యటించి టోకెన్లపై ఆరా తీశారు. వైద్యచికిత్సలు అందిస్తున్న డాక్టర్లు జనరల్ మెడిసిన్ సూర్యుడు, రవిరాం, మధుబాబు, ఆర్థో పవన్, పిహెచ్‌సి డాక్టర్ మురళీకృష్ణతో మాట్లాడారు. చంద్రగిరి మండలం ఎం.కొంగరవారిపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్లో 500 ఇళ్లను సర్వే చేపట్టి 350 టోకెన్లు జారీ రికార్డులను పరిశీలించారు. వైద్యసేవలకు హాజరైనవారు తక్కువగా ఉన్నారని, అవగాహన కల్పించాలన్నారు. డాక్టర్లు కుసుమ, ప్రియాంక, శివాజీ పాల్గొన్నారు. తిరుపతి అర్బన్ పోస్టల్ కాలనీ పరిధిలో క్యాంపు పరిశీలించి పలు సూచనలు చేశారు. డిఎంహెచ్ఒ శ్రీహరి, కమిషనర్ హరిత, హెల్త్ ఆఫీసర్ అన్వేష్‌రెడ్డి, డిఎల్‌డిఒలు సుశీలాదేవి, ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు.

'మీడియాకు సంకెళ్లు' దారుణం

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్

న్యూస్ క్లిక్‌పై ఆంక్షలు , దాడులను నిరసిస్తూ గురువారం పలమనేరు అంబేద్కర్ సర్కిల్ వద్ద జర్నలిస్టు పెడరేషన్ నేతృత్వంలో ఎపిడబ్ల్యుజెఎఫ్, ప్రజాసంఘాల నేతృత్వంలో జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. పత్రిక స్వేచ్ఛను కాపాడాలంటూ నినాదాలు చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతికా స్వచ్ఛపై దాడులు చేస్తూ రాజ్యాగాన్ని అపహాస్యం పాలు చేస్తున్నాయని జర్నలిస్టు ఫెడరేషన్ నాయకులు గోపి అన్నారు. సామాన్య, మధ్యతరగతి హక్కులను ప్రశ్నించడంతో పాటు మతోన్మాదం వల్ల కలిగే ప్రమాదాన్ని తెలియజేసిన న్యూస్‌క్లిక్ కార్యాలయాలు, సిబ్బందిపై దాడులు చేయడంతో ప్రతికాస్వచ్ఛను హరించేలా కేంద్రంలోని మోడి సర్కార్ ప్రయత్నిస్తోందన్నారు. జర్నలిస్టుల ఆందోళనకు సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్పొరేట్‌సంస్థలకు ఊడిగం చేస్తున్న మోడి ప్రభుత్వం ప్రతికా స్వేచ్ఛపై దాడులకు పూనుకుంటోందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అంబేద్కర్ రాజ్యాగం ప్రమాదంలో పడిందన్నారు. ప్రతికా స్వేచ్ఛను హరించేలా దాడులకు పూనుకుంటోదన్నారు. ప్రజాస్వామ్యవాదులు, అభ్యుదయవాదులు, మేధావులు ప్రతికా స్వేచ్ఛపై జరుగుతున్న దాడులను ఖండిచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు మునిరత్నం, సిఎస్ ప్రసాద్, దివ్య, దాము, రామాంజనేయులు, బాలసుబ్రమణ్యం, రాజేష్, మురళి, అశ్వర్ధనారాయణ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుల దౌర్జన్యం నశించాలి : సిపిఎం

ప్రజాశక్తి- గూడూరు టౌన్

న్యూఢిల్లీలో 'న్యూస్ క్లిక్' కార్యాలయం జర్నలిస్టుల నివాసాలపై దాడులను ఖండిస్తూ గురువారం గూడూరు పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో మీడియాతో పట్టణ కార్యదర్శి జోగి.శివకుమార్ మాట్లాడుతూ పాత్రికేయ స్వాతంత్రాన్ని గౌరవించడం తెలియని హేతుబద్ధమైన, విమర్శలను లేదా దేశ వ్యాప్త వ్యతిరేక ప్రచారంగా పరిగణించే కేంద్ర ప్రభుత్వ పాలకుల దౌర్జన్యం నశించాలని, ఈ దుర్మార్గపు చర్యలను సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. భారత రాజ్యాంగ ప్రకారం పాత్రికేయ స్వేచ్ఛను, వారి జీవితాల కోసం తాము పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.వి రమణయ్య, ఎస్.సురేష్, అడపాల ప్రసాద్, బి.గోపీనాథ్, డి. కోటేశ్వరరావు, బి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌క్లిక్‌పై దాడులను నిరశిస్తూ ధర్నా చేస్తున్న జర్నలిస్టులు



శెట్టిపల్లి ప్లాట్లు కేటాయించండి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

శెట్టిపల్లి భూసమస్యపై ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డిల స్పందన వల్ల పెండింగ్‌లో ఉన్న ప్లాట్ కొనుగోలుదారుల దీర్ఘకాలిక కల నెరవేరనుందని, అయితే ఆలస్యం కాకుండా ప్లాట్లు కేటాయించాలని సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం కోరారు. సిపిఎం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం శెట్టిపల్లిలో ల్యాండ్‌పూలింగ్ కింద ప్లాట్ కొనుగోలుదారుల నుంచి, రైతుల నుంచి ప్రభుత్వ భూమిని తీసుకుందని, శెట్టిపల్లి భూ సమస్య పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో సిఎం దృష్టికి, మంత్రులు, ఎంఎల్ఎల దృష్టికి అనేకమార్లు తీసుకెళ్లామన్నారు. భూమన అభినయ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎన్నికల వాతావరణం వస్తుండడంతో త్వరితగతిన భూ సమస్యను పరిష్కరించి ప్లాట్‌దారులకు ప్రొసీడింగ్స్ ఇవ్వాలని కోరారు. ప్లాట్‌దారుల సమస్య పరిష్కరించి శెట్టిపల్లి ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. కలెక్టర్ జోక్యం చేసుకుని శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు కె.వేణుగోపాల్, పి.బుజ్జి, ఎండి శ్రీనివాసులు, ఆర్.మల్లికార్జునరావు, పి.హేమలత పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

చాంబర్ ఆఫ్ కామర్స్ జోన్ కమిటీ చైర్మన్‌గా..
ఘనంగా కెవి చౌదరి ప్రమాణ స్వీకారోత్సవం

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం) ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ రాయలసీమ జోన్ కమిటీ చైర్మన్ గా ప్రముఖ పారిశ్రామికవేత్త కేవీ చౌదరి ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం తిరుపతి-కరకంబాడి మార్గంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ ఫెడరేషన్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పొట్లూరి భాస్కరరావు, మాజీ అధ్యక్షులు కష్ణ ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో ప్రమాణ స్వీకారోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన జోన్ కమిటీ చైర్మన్ గా ఎన్నికైన ప్రముఖ పారిశ్రామికవేత్త కెవి చౌదరి మాట్లాడుతూ వ్యాపారులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నమైన ఈ కమిటీ ముందుండి పరిష్కరించేందుకు తగిన కార్యాచరణతో ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని, భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు తలెత్తిన ముందుండి పోరాడతామన్నారు. వైస్ చైర్మన్ గా కె. రఘురామిరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాజశేఖర్, రాయలసీమ ఉపాధ్యక్షులు విజయకుమార్ రెడ్డి, డైరెక్టర్ రజిత రెడ్డి, రాష్ట్ర మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు పివి.రత్నం, రాయలసీమ, తిరుపతి జిల్లాలలోని అన్ని ముఖ్య ప్రాంతాల్లోని వ్యాపారస్తులు, తిరుపతిలోని 30కిపైగా వ్యాపార సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ముక్కంటి ఈఓగా మళ్లీ భ్రమరాంబ..?


ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



శ్రీకాళహస్తి దేవస్థానం ఈఓగా ఆర్‌జేసి దర్భముళ్ల భ్రమరాంబను దేవాదాయ శాఖ నియమించే అవకాశం ఉందని సమాచారం. విజయవాడ కనకదుర్గ ఆలయ ఈఓగా పనిచేస్తున్న ఆమెను అక్కడి నుంచి ప్రభుత్వం బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆమెను శ్రీకాళహస్తీశ్వర ఆలయ ఈఓగా నియమించే అవకాశం ఉందని తెలిసింది. ఇక్కడ ఈఓగా పనిచేస్తున్న ఈఓ సాగర్ బాబుకు, ఆలయ పాలక మండలి మధ్య సఖ్యత లేకపోవడంతోపాటు ఓ ఛిరుద్యోగి చేతిలో ఆలయ పాలన సాగుతోందన్న విమర్శలు వస్తున్నాయి. దీంతో ఈఓ సాగర్ బాబు బదిలీ అవుతారని జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే శ్రీకాళహస్తి ఆలయ ఈవోగా, తిరుపతి ఆర్జెసిగా పనిచేసిన అనుభవంతోపాటు పలు సంస్కరణలు తెచ్చారు. దీంతో ఒకవేళ ఈఓ సాగర్ బాబు బదిలీ అనివార్యం అయితే ఈఓగా భ్రమరాంబ బదిలీ పై రానున్నారని విశ్వసనీయ సమాచారం. ఇదిలా వుంటే ఈఓ భ్రమరాంబ వస్తే ఇప్పటి ఈఓ సాగర్ బాబుతో సఖ్యతగా మెలుగుతూ వున్న ఆ ఛిరుద్యోగి ఆడిందే ఆట,పాడిందే పాట కొనసాగుతుందో లేదో వేచి చూడాల్సిందే మరి.

జన జాతర

పోలేరమ్మ సేవలో..



భక్తుల రద్దీతో హోరెత్తిన వెంకటగిరి

భక్తులతో నిండిన వెంకటగిరి వీధులు



ప్రజాశక్తి-వెంకటగిరి

వెంకటగిరి గ్రామదేవత పోలేరమ్మ జాతర జన జాతరగా మారింది. గురువారం అమ్మవారి ఊరేగింపుతో రాజావీధి దద్దరిలింది. బుధవారం అర్ధరాత్రి కుమ్మరివీధిలోని అమ్మవారిళ్ళుగా భావించే ఇంటి నుండి అమ్మవారి ప్రతిమను తయారుచేసి అత్తగారిళ్ళయిన జీనిగలవారివీధిలో అమ్మవారికి కళ్ళు, దిష్టిచుక్క పెట్టి అక్కడ నుండి ఊరేగింపుగా అమ్మవారిగుడి నుండి గురువారం తెల్లవారుజాము నుండే భక్తుల దర్శనార్థం పెట్టారు. సాంప్రదాయం ప్రకారం వెంకటగిరి రాజాల నుండి సారే అమ్మవారికి అందజేశారు. వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వెంకటగిరి రాజాలు అమ్మవారికి పూజాసామాగ్రిని అందజేశారు. గురువారం సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో అమ్మవారిని ప్రత్యేక రథంపై ఊరేగింపుగా రాజావీధి మీదుగా కాశీపేట, శివాలయంవీధి మీదుగా మల్లమ్మగుడి ప్రాంతంలో నిమజ్జనం చేశారు. వెంకటగిరిరాజా కుటుంబీకులు సాయికృష్ణ యాచేంద్ర, సర్వజ్ఞకుమార యాచేంద్ర రాజానగిరి నుండి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకునే వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. వికలాంగులు, చిన్నబిడ్డ తల్లులకు ప్రత్యేక క్యూలైను ఏర్పాటు చేసి పోలీసులు స్వయంగా కొంతమందిని వికలాంగులకు దర్శన భాగ్యం కల్పించారు. ఎన్నడూ లేనివిధంగా జాతర ప్రశాంతంగా జరిగేందుకు సిసి కెమారాలు ఏర్పాటు చేయడంతో ఆకతాయిలు జాగ్రత్త పడ్డారు. చోరీలు దాదాపు తగ్గుముఖం పట్టాయి. పోలీసులు బారీ భందోబస్తు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ అంతరాయం లేకుండా రెండు రోజుల పాటు భక్తులకు అవస్థలు లేకుండా చేశారు. పోలీసులు కంట్రోల్ రూమ్ వద్దనే ఉండి భక్తులకు అసౌకర్యం కలగకుండా దర్శనభాగ్యం కలిగే విధంగా చర్యలు తీసుకున్నారు. బుధవారం అర్ధరాత్రి ఊరేగింపు ప్రశాంతంగా జరిగింది. తొక్కిసలాట లేకుండా పట్టణంలో ఊరేగింపు సాగింది. జాతరకు మన రాష్ట్రం నుండే కాకుండా తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణా భక్తులు తరలివచ్చారు. రాజకీయనాయకులు, ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్‌రెడ్డి, సూళ్ళురుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎంఎల్‌సీలు బల్లి కళ్యాణ్‌చక్రవర్తి, మేరిగ మురళీ, దేవదాయశాఖ ఇఓ శ్రీనివాసులరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి స్థానిక ఎమ్మెల్యే కుటుంబ సమేతంగా పట్టువస్త్రాలను అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా బాను ప్రియ, వైస్ చైర్మన్ శాతరాసి బాలయ్య వెంకటగిరి పట్టణ ప్రముఖులు విచ్చేసి మొక్కలను తీర్చుకున్నారు.

వెంకటగిరిలో విఐపిల తాకిడి

వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరలో అమ్మవారిని దర్శించుకునే సామాన్య భక్తజనానికి విఐపిల తాకిడితో అవస్థలు పడ్డారు. నెల్లూరుజిల్లాలోని వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు రావడంతో క్యూలైనులో అమ్మవారిని దర్శించుకొనే భక్తులు గంటలు తరబడిన క్యూలైనులో నిలబడాల్సిన దుస్థితి ఏర్పడింది. మంత్రులు, ప్రజాప్రతినిధులతో పాటు కనీసం 50మందికి తగ్గకుండా వారి అనుచరులతో రావడంతో ఈదుస్థితి నెలకొంది. మంత్రుల కాన్వాయితో పదుల సంఖ్యలో వాహనాలు అమ్మవారి దేవస్థాన సమీపానికి రావడంతో రహదారులన్నీ కుంచించుకుపోయాయి. ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి రాష్ట్రం, జిల్లాలో ప్రత్యేక గుర్తింపు ఉండడంతో ఆయన అనుచరులు పెద్దసంఖ్యలో ఈ జాతరకు తరలివచ్చారు. ఆయన దర్శనానికి వెళ్ళిన సందర్భంలో పెద్దసంఖ్యలో ఆయనతో పాటు ఆయన అనుచరులు దర్శనానికి రావడంతో భక్తుల్లో కొంత వ్యతిరేకత వ్యక్తమైయింది. విఐపిల తాకిడి ఎన్నడూ లేని విధంగా ఈజాతరకు పెరిగిందని అమ్మవారి దర్శనం ఆలస్యంగా సాగిందని పలువురు భక్తులు వాపోయారు.

దాతల దాతృత్వం

జాతరలో పలువురు దాతలు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. స్థానిక మదీనా మోటార్&స్పేర్స్ యజమానికి కరిమూల్లా భక్తులకు ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణి చేశారు. నెల్లూరు డిఆర్ ఉత్తమ్ హొటల్ అధినేత కొడవలూరు ధనుంజయ్‌రెడ్డి అన్నదానం చేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు కలిమిల రాంప్రసాద్‌రెడ్డి అన్నదానం నిర్వహించారు.

మహిళా సాధికారత కోసం అనేక కార్యక్రమాలు..

- రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కేహేమచంద్ర రెడ్డి



ప్రజాశక్తి - క్యాంపస్: రాష్ట్రంలో మహిళల సాధికారత సాధించే దిశగా అమ్మ ఒడి, మహిళలకు చేయూత, డ్వాక్రా రుణాలపై వడ్డీ లేని రుణాలు వంటి పలు పథకాలతో మహిళా సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కే హేమచంద్ర రెడ్డి పేర్కొన్నారు. ఈ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఉమెన్ ఎంపవర్మెంట్ ఉమెన్ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 53 విశ్వవిద్యాలయాలు ఉన్నాయని, 2601 డిగ్రీ కళాశాలల్లో 19,87,618 మంది విద్యార్థులు ఉన్నారని, ఇందులో బాలికలు తొమ్మిది లక్షల 31,553 మంది ఉన్నారన్నారు. 2019 సంవత్సరం నుంచి ఉన్నత విద్యలో బాలికల శాతం పెరుగుతుందన్నారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ శాతం 37.2 శాతంగా ఉందని పేర్కొన్నారు. దీన్ని 70 శాతం కు పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇప్పటికే పర్మినెంట్ పాలకమండలిలో 50 శాతం మంది మహిళలకు స్థానం కల్పించామన్నారు. నాలుగు సంవత్సరాలలో 2,53,862 కోట్ల రూపాయలు మహిళల అకౌంట్ లోకి అమ్మ ఒడి ద్వారా పంపిణీ చేశామన్నారు. రాష్ట్రంలో మహిళా సాధికారత కోసం మహిళలను పారిశ్రామికంగా ఎదిగేందుకు అనేక రకాలుగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలతో ప్రోత్సహిస్తున్నదన్నారు. నాలుగు సంవత్సరాలలో రాష్ట్రంలో మహిళల్లో చదువుకున్న వారి శాతం పెరిగినందున శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో బాలికలకు అవకాశాలు ఉన్నత విద్యను డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా ఆన్లైన్ కోర్సుల ద్వారా డిప్లమా కోర్సులు అందించేందుకు ఉపాధి కల్పించే కోసం అందించేందుకు కృషి చేస్తామన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు అన్ని రకాలుగా రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. రాష్ట్ర క్రీడల, యువజన వ్యవహారాల శాఖ మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ ఆకాశంలో సగం అవకాశాల్లో సగం అన్నింటిలో సగం సాధించినప్పుడే మహిళా సాధికారత సార్థకమవుతుందన్నారు రాష్ట్రంలో మహిళా సాధికారత అనే అంశంపై శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రత్యేకమైన సమావేశాన్ని ఏర్పాటు చేయడం ఈ ప్రాంత వాసిగా గర్విస్తున్నానన్నారు. ఎంతో మంది మహిళలను అణగదొక్కేందుకు చదువుకునేటప్పుడు, ఉద్యోగం చేసే ప్రాంతాల్లో, సినిమా రంగంలో, ఏ రంగంలో అయినా మానసికంగా మన వ్యక్తిత్వంపై నిందలు వేస్తారని వాటిని అన్నిడా భావించకుండా, కుంగిపోకుండా ముందుకు సాగాలన్నారు. మహిళలు చంద్రమండలం మీదికి వెళ్లే స్థాయికి ఎదిగారన్నారు. ఏ రంగంలో చూసినా మహిళలు ఉన్నతంగా రాణిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎంతో మంది బాలబాలికల ఉన్నత చదువులకు ఎన్నో ఉచిత పథకాలు అమలు చేస్తూ ఉన్నత చదువులకు సహకారం అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ డాక్టర్ శిరీష, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డి.భారతి, కుల సచివులు ఆచార్య ఎన్ రజని, ఆచార్య ఉమా మహేశ్వరి దేవి, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికులకు మెరుగైన సేవలు



కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న పిసి రాయలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రైల్వే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేలా తగిన చర్యలు తీసుకోవాలని జోనల్ రైల్వేస్ యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. గురువారం తెలంగాణ రాష్ట్రంలోని సికింద్రాబాద్ రైల్వే హౌస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మెంబర్స్, ఎంపీలు, 25 మంది సభ్యులు పాల్గొని రైల్వే ప్రయాణికులకు అవసరమైన మెరుగైన సేవల కల్పనపై ప్రసంగించారు. బోర్డు సభ్యులు, జెడ్ ఆర్ యుసిసి మెంబర్ డాక్టర్ పిసి రాయలు మాట్లాడుతూ తిరుపతి రైల్వే స్టేషన్ లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అలానే నూతనంగా ఏర్పాటు చేసిన తిరుచానూరు రైల్వే స్టేషన్ త్వరగా ప్రయాణికులకు వాడుకలోకి తీసుకురావడానికి రెండు రైల్వే లైన్లను అదనంగా పెంచుతూ ప్యాసింజర్ల కోసం ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తిరుచానూరు రైల్వే స్టేషన్ పేరును తిరుపతి ఈస్ట్ గా మార్చుతూ తిరుపతి వెస్ట్ స్టేషన్ ను అభివృద్ధి చేయాలని కోరారు. చంద్రగిరి రైల్వే స్టేషన్ ను ప్రయాణికులకు శ్రీనివాస మంగాపురం పేరుతో వాడుకలోకి తీసుకురావాలని, తిరుపతి నుండి తిరువణ్ణామలై ఒక మోనో రైల్ నడపాలని కోరారు. భక్తుల సౌకర్యార్థం తిరుపతి నుంచి వందేభారత్ రైలును బెంగుళూరు, మైసూరుకు అతిత్వరలో రైలును నడపాలని సమావేశంలో కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు వినోద్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి -కోట: కోట పంచాయతీ పరిధిలో నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి దళితవాడ లో రోడ్డు నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి జగనన్న ప్రభుత్వంలోనే సాధ్యమని అన్నారు.కోట పట్టణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. కోట అభివృద్ధికి సహకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని వినోద్ రెడ్డి కాంట్రాక్టర్ కు సూచించారు. గతంలో ఈ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని వినోద్ కుమార్ రెడ్డి మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే కలెక్టర్లకు వినతిపత్రాలు అందించారు. మంజూరైన ఎంపీ, జడ్పీ గ్రాంటు 10 లక్షల రూపాయలతో ఈ పనులు చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి వెంట కోట పంచాయతీ ఉపసర్పంచ్ గాది భాస్కర్, మాజీ సర్పంచ్ బొర్రా పద్మమ్మ కోట పంచాయతీ 3 వ వార్డు మెంబర్ పేర్నేటి కిరణ్ కుమార్,2వ వార్డు మెంబరు కిష్టమ్మ, షేక్ యస్దాని, బుజ్జయ్య, యర్రమతి వివేక్, మండిగ, నవకోటి, స్థానికులు పాల్గొన్నారు.

ఆదిశంకరలో వరల్డ్ పీస్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం



మాట్లాడుతున్న ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పెంచలయ్య

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో మహర్షి వరల్డ్ పీస్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం నిర్వ హించారు. ఈ సందర్భంగా కళశాల చైర్మన్ వంకి పెంచలయ్య మాట్లాడుతూ ఇండియాలో నే మొదటి గా కాన్షియస్ నెస్ బెస్ట్ ఎడ్యుకేషన్ ను మహర్షి వేదిక్ యూనివర్సిటీ తో సంయుక్తంగా తమ కళాశాల లో ప్రవేశ పెట్టారన్నారు. 2024 జనవరిలో పది వేల మందితో జరిగే మహర్షి అంతర్జాతీయ ప్రపంచ శాంతి ప్రోగ్రాంలో పాల్గొనేందుకు తమ కళశాల నుండి 5 వేల మందికి శిక్షణ ఇచ్చి పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళశాల డైరెక్టర్ మోహన్ , ప్రిన్సిపాల్ ధనుంజయ , అకాడమిక్ డైరెక్టర్ రాజాయ్య , ఏవో రామయ్య , వేదిక్ యూనివర్సిటీ ఆచార్యులు రవికుమార్ గురూజీ , అజయ్ చైతన్య , కళశాల అధ్యాపకులు , విద్యార్థులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుతాం'ను విజయవంతం చేద్దాం:ఎంపిడివో

ప్రజాశక్తి-రామచంద్రాపురం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆర్‌సి పురం లో శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్వహించే 'జగనన్నకు చెబుదాం'ను విజయ వంతం చేయాలని స్థానిక ఎంపీడీవో, తహశీల్దార్ శ్రీనివాసులు, జిసి వెంకటేశ్వర్లు కోరారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు కలెక్టర్ వెంకట రమణారెడ్డి, అన్ని శాఖలకు సంబంధించి జిల్లా స్థాయి అధికారులు హాజరవుతారని తెలిపారు. తహశీల్దారు జిసి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలోని ప్రజలు తమ సమస్యలను జగనన్నకు చెబుదాం లో జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. మండలంలో భూ సమస్యలు, విద్యుత్ సమస్యలు, రేషన్ కార్డ్, ఇంటి పట్టాలు, పక్క గృహాలు, పింఛన్లు కోసం దరఖాస్తుల చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ శాఖ అధికారులు రాజా మస్తాన్, హేమచంద్ర రెడ్డి, ఈవోపీఆర్డి దేవిక, పంచాయతీ కార్యదర్శులు సురేష్, పద్మారాణి, సంజీవరెడ్డి, వీఆర్వోలు సిద్దయ్య, నాగజ్యోతి, సతీష్. ప్రసాద్, చిరంజీవి, బాబు ఖాన్ వర్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడివో శ్రీనివాసులు

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక త్యాగరాజావీధీ లోని శ్రీ కళ్యాణవీరభద్ర స్వామి దేవస్థానంలో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్ , ఆంధ్ర మహిళ మండలి వారి సహకారంతో 37 మంది పేద వికలాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతలుగా గోకర్ణ ముని కృష్ణయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు జయ జ్యోతి , మునీంద్రులు వ్యవహరించి, ఐదు వేల రూపాయలు అందించారు. ఈ సందర్భంగా ఆంధ్ర మహిళ మండలి గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ రోహిణి మాట్లాడుతూ ప్రతి నెల క్రమం తప్పకుండా రెడ్ సంస్థ దివ్యాంగులకు ఫల సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు . ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు విష్ణువందన, ఆంధ్ర మహిళ మండలి అధ్యక్షురాలు జమునమ్మ, కార్యదర్శి స్నేహలత రెడ్డి , రెడ్ సంస్థ అధ్యక్షులు జానా సుధీర్, లక్ష్మీ , ఉషా, పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సేవాభావం అలవర్చుకోవాలి: ప్రిన్సిపల్



మాట్లాడుతున్న శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ జయచంద్ర

ప్రజాశక్తి -రేణిగుంట : విద్యార్థి దశ నుంచే విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జయచంద్ర పిలుపునిచ్చారు. గురువారం రేణిగుంట మండలంలోని కరకంబాడి రోడ్ లో వున్న శ్రీరామ ఇంజనీరింగ్ కాలేజ్ లో మొదటి సంవత్సరం విద్యార్థులకు జాతీయ సేవ విభాగం మీద అవగాహనకి ముఖ్య అతిథిగా ఐఐటితిరుపతి జాతీయ సేవా విభాగం ఆఫీసర్ మహేష్ విచ్చేసి విద్యార్థులకు జాతీయ సేవ విభాగం పై విద్యార్థులకు అవగాహన కలిపించారు. ఈ సందర్భంగా సేవ విభాగం ఆఫీసర్ మహేష్ మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలతో జాతీయ సేవ విభాగం ప్రారంభమైందన్నారు. జాతీయ సేవా విభాగం ముఖ్య ఉద్దేశం సమాజానికి మనకు వీలైనత వరకు 'సేవ చేయాలి'అని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.జయచంద్ర మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే అందరూ సేవ భావం అలవరచు కోవాలని తెలిపారు. శ్రీరామ ఇంజనీరింగ్ కాలేజ్ జాతీయ సేవ విభాగం కార్యక్రమాల్లో అందరూ పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, డైరెక్టర్స్ మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి, జాతీయ సేవ విభాగం ఆఫీసర్ ఎస్ నక్రి శ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వేమన పద్య పోటీలను జయప్రదం చేయండి



ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పరిషత్ పాఠశాలలో గురువారం తెలుగు భాషకు వైభవం తెచ్చి పెట్టింది పద్యం. పిల్లల భవిత కు పునాది పద్యం అంటూ 'తిరుపతి బాలోత్సవం వేమన విజ్ఞాన కేంద్రం' సంయుక్త ఆధ్వర్యంలో 'వేమన పద్యానికి పట్టాభిషేకం' కార్యక్రమాన్ని గొప్ప సంకల్పంతో రూపొందించారు. ఇందులో భాగం గా వేమన విగ్రహం ఊరేగింపు కూడా చేయాలని తిరుపతి జిల్లా బాలోత్సవ కార్యదర్శి నడ్డి నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతి జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులకు వేమన పద్య పఠనం పోటీలు నిర్వహించాలని తెలిపారు. ఈ పోటీలు మూడు విభాగాల్లో నిర్వహిస్తున్నట్లు అందులో భాగంగా కాళహస్తి నియోజకవర్గం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రేణిగుంట జిల్లా పరిషత్ బాలికల పాఠశాల లో ఈ నెల 10వ తేదీ ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. ఒకటి, రెండు, మూడు తరగతుల విద్యార్థులకు వేమన పద్య పఠనం మాత్రమే ఉంటుందని నాలుగు నుండి ఆరవ తరగతి విద్యార్థులకు వేమన పద్యం భావం కూడా చెప్పాల్సి ఉంటుందన్నారు. ఈ విభాగంలో మంచిగా పద్యాలు, భావాలు చెప్పిన వారిని విజేతలుగా ఎంపిక చేసి ప్రత్యేక బహుమతులు ఇస్తామని, 7 నుండి 9వ తరగతి విద్యార్థులకు వేమన పద్య పఠనం, భావం చెప్పటం అలాగే పద్యం భావం చూడకుండా రాయడం కూడా ఉంటుంది. అని అన్నారు. ఈ విభాగంలో కూడా పద్యాలు, భావాలు చెప్పి రాయాలి అనితెలిపారు. అనంతరం విజేతలకు తిరుపతిలో బహుమతులు ఇస్తారని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ఉపాధ్యాయులు, మేధావులు, వివిధ సాహితీ సంస్థలు కృషి చేయాలని ఓ. వెంకటరమణ, తెలిపారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధనం పాల్గొన్నారు.

మహిళా కోలాట కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: మండలంలో ఉన్న అన్నీ రకాల కళాకారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు పంపిణీ చేసి కొండ పైన ప్రదర్శన కు అనుమతి మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండల పుత్తూరు మండల గౌరవ అధ్యక్షులు డి మహేష్ డిమాండ్ చేశారు. గురువారం పుత్తూరు మండలం లో మహిళా కోలాట బృందాల ఆధ్వర్యంలో తాసిల్దారు పరమేశ్వర స్వామికి అర్జీలు సమర్పించారు. ఈసందర్భంగా డి మహేష్ మాట్లాడుతూ దేశ సంస్కృతి సంప్రదాయాలకు నిలయం గ్రామీణ జానపద కళలు అని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న జానపద కళలు మరుగున పడకుండా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర వ్యాప్తంగా బతికిస్తూ వారికి అండగా ఉంటూ కళాకారుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమిస్తోందన్నారు. ఆ పోరాటాల ఫలితంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో మాజీ ముఖ్యమంత్రి వై యస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో వేలాది మంది కళాకారులకు 3 వేల రూపాయల పెన్షన్ ఇప్పించిందన్నారు. ఇంకను వేలాది మంది కళాకారులూ గుర్తింపు కార్డులు పెన్షన్లు మంజూరు కోసం ఎదురు చూస్తున్న సమయం లో ప్రభుత్వం నూతన జీ ఓ తీసుకు రావడం హర్షించదగిన విషయం అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం లో మహిళా కోలాట బృందాల ప్రదర్శన కు అనుమతి మంజూరు చేయాలన్నారు. పేదలకు అన్నీ రకాల సమస్యల పరిష్కారానికి ఎర్రజెండా అండగా ఉంటుందని కళాకారులకు భరోసా ఇచ్చారు . అదే విధంగా కళాకారుల గుర్తింపు కార్డులు పంపిణీ కోసం దరఖాస్తు లు తీసుకునే ఆఖరు తేది అక్టోబర్ 6 అని చెప్పడం భావ్యం కాదని, తేదీని పొడిగించాలని డిమాండ్ చేశారు. కోలాట బృందం లో ఉన్న వారందరూ మహిళలే అని వారు అన్ని సమస్యల్లో మీకు తోడుగా ఉంటామని అన్నారు . ఈ సమావేశం లో కళాకారులు ప్రభావతి ,నారాయణమ్మ, దేశమ్మ, సుబ్బమ్మ ,మురళి, గీత పాల్గొన్నారు.

వైద్య సేవలు ప్రజలకు చేరువ చేసేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

ప్రజాశక్తి-పాకాల: జగనన్న సురక్ష ద్వారా ప్రభుత్వం అందించే వైద్య సేవలు ప్రజలకు చేరువ అయ్యేందుకే అని చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. మండలంలోని గాదంకి జిల్లా పరిషత్ హై స్కూల్ లో హెల్త్ క్యాంప్ ను గురువారం తుడా ఛైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తన ప్రజల కోసం రెండు నెలల క్రితమే వైద్య పరీక్షలకు ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. హెల్త్ క్యాంప్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోం దన్నారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ఆరోగ్య పరీక్షలు నిర్వహి స్తుండటంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారన్నారు. ప్రత్యేకించి బీపీ, షుగర్, గుండె తదితర వైద్య పరీక్షలు చేస్తున్నారని తెలిపారు. స్వగ్రామంలో కార్పొరేట్ వైద్యం అందు తుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నా రని, కలెక్టర్ హెల్త్ క్యాంప్ ను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించి, వైద్య సిబ్బందికి సూచనలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లు: జగనన్న సురక్ష ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బాదం యుగంధర్ రెడ్డి కోరారు. దీందార్లపల్లి పంచాయతీ ప్రజలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు తేట్టుపల్లి సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభం కానుందన్నారు. ఈ కార్యక్రమంలో 15 రకాల ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేస్తారని, జబ్బులకు మందులు ఉచితంగా ఇస్తారన్నారు. మెడికల్ క్యాంప్ కు వచ్చే వారు ఖచ్చితంగా వారి ఆధార్ కార్డ్ తీసుకురావాలని సూచించారు.వాలంటీర్లు తమ పరిధిలోని ప్రతి ఒక్కరూ ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొనే విధంగా అవగాహన కల్పించి తీసుకు రావాలని కోరారు.


పుత్తూరు టౌన్: రాష్ట్రంలో ప్రతి పేదవాడికి ఆరోగ్యా న్ని అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్య మని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్.కె.రోజా తెలిపారు. పుత్తూరు మున్సిపాలిటీలో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష ముఖ్య అతిథిగా మంత్రి ఆర్కే రోజా హాజరయ్యారు. మాట్లాడుతూ 7716 మందికి వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించి 3,962 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటివెలుగు కింద 1400 మందికి పరీక్షలు నిర్వహించగా 140 మందికి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు మున్సిపాలిటీ కమిషనర్ ఏ కే ఎల్ ఎం రెడ్డి, చైర్మన్, ఏ హరి. వైస్ చైర్మన్లు డీ. శంకర్, డి జయ ప్రకాష్, కౌన్సిలర్లు, ఏకాంబరం, గుణశేఖర్, రాధా, స్టేట్ డైరెక్టర్లు, కమిషనర్, వైద్య ఆరోగ్య అధికారులు, తహశీల్దార్ పరమేశ్వర స్వామి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నాయుడుపేట: ఇంటి వద్దకే మెరుగైన వైద్య సేవలు అందించే విధం గా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. గురువారం పట్టణంలోని ఎల్ ఏ సాగరం హెల్త్ క్లినిక్ లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేదల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించి ఇంటి వద్దకే వైద్య సేవలు అందించాలన్న దృక్పథంతో జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, నాయుడుపేట ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, మాజీ అండ్ డిసిసిబి డైరెక్టర్ కలికి మాధవరెడ్డి, వైసిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి ఈదారత్నశ్రీ, మున్సిపల్ కౌన్సిలర్లు ధారా రవి,చదలవాడ కుమార్, షేక్ షబ్బీర్, మున్సిపల్ కమిషనర్ వి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు అన్నమేడు చంద్రారెడ్డి, షేక్ రహంతుల్లా, పేర్నాటి రాహుల్,షేక్ జిలాని, సాదు మోహన్ పాల్గొన్నారు.



నాయుడుపేటలో



ఏర్పేడు : మండల కేంద్రమైన ఏర్పేడు లో ఎంపీడీవో కార్యాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా జరపటం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏర్పేడు మండల వైసీపీ ఇన్చార్జ్ గున్నేరి కిషోర్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ జగనన్న అమలు చేసిన ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తెలిపారు. మెడికల్ క్యాంపును కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గిడ్డయ్య , జడ్పిటిసి తిరుమలయ్య, వైసిపి నాయకులు, వైద్య బృందం, సర్పంచులు, ప్రజలు పాల్గొన్నారు.

ఈ ఏడాది చివరలో ఆస్పత్రి ప్రారంభం:ఎమ్మెల్యే



ఆస్పత్రి నిర్మాణ పనుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వరప్రసాద్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు నూతనంగా చేపట్టిన ఆసుపత్రి నిర్మాణం పూర్తి కావస్తోందని ఎమ్మెల్యే వరప్రసాద్ రావు, స్వచ్ఛ ఆంధ్ర చైర్ పర్సన్ పోణకా దేవసేనమ్మ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని ప్రాంతీయ ఆసుపత్రి ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి భవనాలను ఎమ్మెల్యే వరప్రసాద్ రావు, పోణకా దేవసేనమ్మ, పురపాలక సంఘం మాజీ చైర్ పర్సన్ కోడూరు కల్పలత, వైసిపి సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి తదితరులతో కలిసి పరిశీలించారు. 'నిర్మాణాలు ఎంతవరకు వచ్చాయి? ఎప్పుడు ప్రారంభించవచ్చు?తదితర అంశాలపై వారు చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాద్ రావు మాట్లాడుతూ..విద్య, వైద్యానికి సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఆసుపత్రి నిర్మాణానికి 22కోట్ల రూపాయలను ఆయన మంజూ రు చేశారని గుర్తు చేశారు. ఈ ఏడాది డిసెంబరు లో ప్రారంభించి రోగు లకు మెరుగైన వైద్యసే వలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసయ్య, ఆల్తాఫ్, అశోక్, జీనత్, లక్ష్మి, ఆసుపత్రి సూపరిడెంట్ డాక్టర్ షరీనాపాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం:ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్: సంక్షేమం, అభివృద్ధితో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతున్నారని ఎమ్మెల్యే వరప్రసాద్ రావు, స్వచ్ఛఆంధ్ర సంస్థ చైర్ పర్సన్ పోణకా దేవసేనమ్మ పేర్కొన్నారు. గూడూరు రెండో పట్టణ పరిధిలోని వీరారెడ్డిపల్లి ప్రాంతంలో ఏర్పాటైన జీ ఎస్సార్ పురపాలక ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్షను గురువారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వరప్రసాద్ రావు, స్వచ్ఛ ఆంధ్ర చైర్ పర్సన్ పోణకా దేవసేనమ్మ, పురపాలక సంఘం మాజీ చైర్ పర్సన్ కోడూరు కల్పలత హాజరయ్యారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్ ను వారు పరిశీలించారు. వైద్యులతో మాట్లాడారు. ఆయుష్మాన్ కార్డులను పేదలకు అందజేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే వరప్రసాద్ రావు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షకింద ఏడు రకాల వ్యాధులకు సంబంధించి వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహిస్తారని,143రకాల మందులు అందిస్తారి వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసయ్య, వినీష్, ఆల్తాఫ్, రాఘవరెడ్డి, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శాసన మండలి విప్ గా ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

- నాయకులు, కార్యకర్తల హర్షం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఆంధ్రప్రదేశ్ శాసన మండలి విప్ గా నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ను సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి నియమిస్తు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మురళీధర్ మాట్లాడుతూ తనను ఎమ్మెల్సీ గా, సహాయ మంత్రి హోదాతో కూడిన శాసన మండలి విప్ గా నియమించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి తాను ఎప్పుడూ రుణపడి ఉంటానన్నారు. ఆయన అప్పగించిన ప్రతి బాధ్యతను వమ్ముచేయబోనని పేర్కొన్నారు. అనంతరం పార్టీ నాయకులు , కార్యకర్తలు అభినందనలు తెలిపారు.



క్రీడాకారుల స్టేడియం మరుగుదొడ్ల నిర్మాణాన్ని ప్రారంభిస్తున్నఎమ్మెల్యే వరప్రసాద్

క్రీడాకారులకు మెరుగైన వసతులు:ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్: క్రీడాకారులకు ఇబ్బందులు లేకుండా ఉండే లా ప్రహరీ తో పాటు మరుగు దొడ్లు నిర్మిసు న్నామని ఎమ్మెల్యే వర ప్రసాద్ రావు పేర్కొన్నారు. గూడూ రు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంకు సంబంధించిన ప్రహరీగోడ, మరుగుదొడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే వరప్రసాద్ రావు, స్వచ్ఛఆంధ్ర సంస్థ చైర్ పర్సన్ పోణకా దేవసేనమ్మ, పురపాలక సంఘం మాజీ చైర్ పర్సన్ కోడూరు కల్పలత, వైసిపి సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్ రెడ్డి భూమి పూజ నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాద్ రావు మాట్లాడుతూ చాలాకాలం క్రితం స్టేడియం స్థలాన్ని ఆసుపత్రికి కేటాయించడంతో క్రీడాకారుల కోరిక మేరకు ఆ స్థలాన్ని తిరిగి అప్పగించారు. ఆ స్థలంలో ప్రహరీతో పాటు మరుగుదొడ్లు నిర్మిస్తామని తెలిపారు. స్టేడియం లో క్రీడాకారులకు అన్నీ వసతులు సమకూరు స్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసయ్య, ఇమ్రాన్, సురేష్ రెడ్డి, ముని, సాయి, ఆల్తాఫ్, అశోక్, జీనత్, లక్ష్మి పాల్గొన్నారు.



కక్ష పూరిత రాజకీయాలు మానుకోవాలి: టిడిపి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాజకీయ ప్రత్యర్థులపై సీఎం జగన్ కక్ష పూరిత రాజకీయాలను మానుకోవాలని టీడీపీ నాయకులు హెచ్చరించారు. స్థానిక ఎన్టీఆర్ భవన్లో చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా గురువారం టిడిపి నాయకులు నిరసన తెలిపారు. జరగనిది జరిగినట్లుగా, లేనిది ఉన్నట్లు భ్రమలు కల్పించి చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించారని నాయకులు ఆరోపించారు. ఎవరెన్ని అవినీతి ఆరోపణలు చేసినా మచ్చలేని చంద్రుడిలా బాబు తిరిగి వస్తారని ఆశాభావం వ్యక్తపరిచారు. దశరధాచారి, రెడ్డివారి గురవారెడ్డి, మిన్నల్ రవి, యం.సు బ్బయ్య, ఉమేష్ రావు పాల్గొన్నారు.

బెట్టింగులతో ప్రాణాలు మీదికి తెచ్చుకోవద్దు: సిఐ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : క్రికెట్ వరల్డ్ కప్ మ్యాచ్ జరుగుతున్నాయని ఎవరైనా ఆన్లైన్‌లలో బెట్టింగుకు వెళ్లి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని పుత్తూరు సిఐ కే లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గురువారం నుండి క్రికెట్ వరల్డ్ కప్ మ్యాచ్‌లు జరుగుతాయని, ఎవరైనా ఆన్లైన్ లేదా సాధారణ బెట్టింగ్ లకి పాల్పడ్డారన్న సమాచారం వినిపిస్తే పోలీసులకు తెలపాలని కోరారు. బెట్టింగ్స్ లలో డబ్బులు పోగొట్టుకొని ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని కోరారు. ముఖ్యం గా విద్యార్థులు బెట్టింగ్ ల జోలికి వెళ్లి వారి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, మీకు తెలిసిన సమాచారం ను పోలీస్ లకి తెలిపి సహకరిచాలని కోరారు.



అపరి శుభ్రంగా మారిన ఏర్పేడు పరిసర ప్రాంతం

కనిపించని పారిశుధ్యం!

ప్రజాశక్తి -ఏర్పేడు: కొన్ని నెలలుగా ఏర్పేడు శివారులో హెచ్పీ గ్యాస్ సమీపాన నేషనల్ హైవే పక్కన విచ్చలవిడిగా చికెన్ వ్యర్థాలను, చికెన్ సెంటర్ యజమానులు రోడ్డు పక్కన వ్యర్థాలను పడవేయడం వల్ల దుర్గంధమైన వాసన రావడంతో వాహనదారులు వాసన భరించలేక అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఆ ప్రాంతంలోని వ్యర్థాలను తొలగించి వాహనదారులక, ప్రజలకు ఎలాంటి వ్యాధులకు గురికాకుండా, వ్యర్థాలను చికెన్ సెంటర్ యజమానులు రోడ్డు పక్కన పడవేయకుండా తగు జాగ్రత్తలు పాటించాలని పాటించకుంటే చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించాలని వాహనదారులు వాపోతున్నారు.

ఈస్ట్ ఎస్ఐ పురుషోత్తం రెడ్డి బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా జి. పురుషోత్తం రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. సత్యవేడు పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న పురుషోత్తం రెడ్డి బదిలీపై తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ కు వచ్చారు.

తిరుపతి ఎన్‌సిసి క్యాడేట్లకు సన్మానం



ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి ఎన్‌సిసి క్యాబినెట్లు జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీలలో వివిధ విభాగాలలో బంగారు, కాంస్య, రజిత పతకాలతో విజయాలు సాధించడం తిరుపతి ప్రాంతానికి గర్వకారణమని తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీష పేర్కొన్నారు. గురువారం ఎన్సిసి నగర్ లోని క్యాంపు కార్యాలయంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన వివిధ పోటీలలో రాణించిన విద్యార్థులకు అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్సిసి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం ద్వారా విద్యార్థులు స్కూలు తరగతి చదువుకునే అప్పటినుంచి క్రమశిక్షణతో, పట్టుదలతో, ఏకాగ్రతతో, నీతి, నిజాయితీగా, దేశం కోసం, దేశ, జాతీయ భావాలను పెంపొం దించు కుంటారన్నారు. ఎన్సిసి గ్రూప్ తిరుపతికి చెందిన 17 మంది క్యాడెట్‌లు న్యూ ఢిల్లీలో ఇటీవల ముగిసిన ఆల్ ఇండియా థాల్ సైనిక్ క్యాంప్ పోటీలలో అద్భుతమైన, చారిత్రాత్మక ప్రదర్శన తర్వాత తిరుపతికి వచ్చిన హీరోలకి స్వాగతం పలికారు. ఈ అభినందన కార్యక్రమంలో విద్యార్థులను ఉపాధ్యాయులను వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎన్సిసి ఉన్నతాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరరాజ స్కిల్ డెవలప్‌మెంట్‌లో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి- రేణిగుంట: అమరరాజ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో నిరుద్యోగ యువతకి ఉచిత శిక్షణ ఉపకార వేతనం (స్టైపెండ్)తో పాటు ఉద్యోగ అవకాశాలు వున్నాయని అమరరాజ యాజమాన్యం తెలిపింది. అమరరాజా సంస్థ మద్దతుతో రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2014లో అమర రాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ని చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం పేటమిట్ట గ్రామంలో స్థాపించారు. ఇప్పటి వరకు ఈ సంస్థ ద్వారా (14 బ్యాచ్ లు) 1314 మంది నిరుద్యోగ యువత తమ ట్రైనింగ్ పూర్తి చేసుకున్నారు. ఇలా ట్రైనింగ్ పూర్తి చేసుకొన్న 1314 మందికి అమరరాజ సంస్థలో పర్మినెంట్ ఉద్యోగ అవకాశం కల్పించారు. ఇప్పుడు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో 18 బ్యాచ్ ల్లో 1370 మంది నిరుద్యోగ యువత శిక్షణ పొందుతున్నారు. అమర రాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో 10వతరగతి పాస్ ఫెయిల్ లేదా ఇంటర్ పాస్ ఫెయిల్ అయిన నిరుద్యోగ యువతి యువకు లకు (33వ బ్యాచ్) అడ్మిషన్స్ నిర్వహిస్తున్నారు. ఎంపికైన విద్యార్థులకు శిక్షణా కాలంలో మొదటి 3 నెలలు నెలకు రూ.7.500 లు, 21 నెలలు రూ. 11,453 నుండి రూ.11,853 వరకు ఉపకార వేతనం (స్టైపెండ్) ఇవ్వనున్నారు. 33వ బ్యాచ్ అడ్మిషన్లు ఈ నెల 26 వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయి. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ ఇతర వివరాలకు 9000024919, 9100477371 నెంబర్లు సంప్రదించాలని కోరారు.

33వ బ్యాచ్ అడ్మిషన్లు ప్రారంభం



ఎస్వీయూలో ముగిసిన జాతీయ సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు గురువారం ప్రకాశం భవనంలోని సెమినార్ హాల్లో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహిళా విశ్వవిద్యాలయం న్యాయ విభాగం సీనియర్ ఆచార్యులు ఆచార్య టి. సీతా కుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశంలో పర్యావరణ పరిరక్షణకు ఉన్న చట్టాలను గురించి వివరంగా తెలుపుతూ భారతదేశ ప్రస్తుత, మాజీ ప్రధానులు పర్యావరణ పరిరక్షణ చట్టాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని తెలియజేసారు. ఈ ముగింపు కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి. శ్యామ్ మోహన్ డేవిడ్ రాజు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత మరియు సుస్థిరత ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యత అని నొక్కి వక్కాణించారు. ఈ సెమినార్ డైరెక్టర్ , మహిళ అధ్యయన కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ కె. సుధారాణి రెండు రోజుల సదస్సు గురించి విశదీకరించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్ విభాగం అకాడమిక్ కన్సల్టెంట్స్ డి రమణ,డి రాజరాజేశ్వరి, డా వి జగదీశ్వరి, కె శ్రీలత కిషోరీ, పి సునీత, పరిశోధక విద్యార్థులు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.